క్లుప్తంగా

సభను జయప్రదం చేయండి



పాన్‌గల్: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.

వదంతులు నమ్మొద్దు

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాలలో రేషన్‌కార్డులు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలనే విషయమై ఉన్నతస్థాయి అధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు వాట్సప్‌గ్రూపుల్లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

పెబ్బేరు రూరల్: వయోవృద్ధులకు చేయూత నివ్వాలని వనపర్తి లోక అదాలత్ చీఫ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలనాగయ్య అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లభనగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

రహదారుల విస్తరణకు సహకరించాలి



వనపర్తిటౌన్: రహదారుల విస్తరణకు 6వ వార్డు మెట్టుపల్లి ప్రజలు సహకరించాలని కౌన్సిలర్ రవి కోరారు. శనివారం రోడ్ల విస్తరణలో భాగంగా తన సొంత ఇంటిని తొలగించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన జనార్దన్‌ను ఆయన అభినందించారు. ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

నేటి నుంచి బీజేపీ సమావేశాలు

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలోని మండలాల్లో ఆదివారం నుంచి వారం రోజుల పాటు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా 20న మక్తల్, 21న ఊట్కూర్, 22న అమరచింత, 23న ఆత్మకూర్, 24న నర్వ, 25న మాగనూర్, 26న కృష్ణ మండలాల్లో సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రావు

ఆత్మకూర్: పట్టణానికి చెందిన న్యాయవాది దివాన్జీ అశోక్‌కుమార్ టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామకపత్రాన్ని అందించారు.

విద్యార్థులకు గ్లాసుల వితరణ



పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న రాగిజావా తాగేందుకు వీలుగా గ్లాసులను దావాజిపల్లి సర్పంచ్ వెంకటయ్య యాదవ్ శనివారం విద్యార్థులకు అందజేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 110 స్టీలు గ్లాసులను విద్యార్థులకు పంపిణీ చేశారు. దీంతో పాటు పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజెన్సీ మహిళలకు చీరలను అందజేశారు.

రాగి జావ పంపిణీ

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శనివారం రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని 28 పంచాయితీల పరిధిలోని 36 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం రాగిజావను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



సర్వీస్ రోడ్డు లేక జాతీయ రహదారిని దాటుతున్న విద్యార్థులు(ఫైల్)

- జిక్కుజిక్కుమంటూ వెళ్తున్న విద్యార్థులు
- ఏళ్లు గడిచిన పట్టించుకోని పాలకులు

పెబ్బేరు రూరల్: ఉన్నత విద్య కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి పాఠశాలలు, కళాశాలలు నిర్మించి విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేశారు. కానీ ప్రమాదాల అంచున ప్రయాణాలు ఉంటాయని గుర్తించలేకపోయారు. పట్టణ కేంద్రంలో 44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మత్స్య కళాశాల, ఆదర్శ పాఠశాల, ఆర్టీఓ కార్యాలయం, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఉండడంతో ప్రతి రోజు వందల మంది విద్యార్థులు వెళ్లాలంటే సర్వీస్ రోడ్డు లేక ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. పట్టణ కేంద్రానికి కుడివైపు ఉండడం వల్ల పాఠశాల, కళాశాలల సమీపంలో యూ టర్న్ ఉండాలి. లేకపోవడం వల్ల ఆర్టీసీ బస్సు, ఆటోలు, ఇతర వాహనాలు తోమాలపల్లి స్టేజీ నుంచి యూటర్న్ చేసుకొని రావాలి. దీంతో పట్టణ కేంద్రానికి 4 నుంచి 5 కిలోమీటర్ల దూరమవుతుంది.

అధికంగా ప్రమాదాలు ఇక్కడే..

పెబ్బేరు నుంచి కొత్తకోట వైపు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకొని కుడివైపున మత్స్య కళాశాలకు 150 మంది, ఆదర్శ పాఠశాలకు 600 మంది, ఆర్టీవో కార్యాలయం సుమారుగా 100 మంది, మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 204 మంది విద్యార్థులు, ప్రజలు వెళ్లి వస్తుంటారు. వీటికి సర్వీస్ రోడ్డు వేయాలని విద్యార్థులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు, జాతీయ రహదారి అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు ఎవరు స్పందించలేకపోవడంతో ప్రమాదాలు అవుతున్నారు.

- వై.శాఖపూర్ చెందిన ఇద్దరు వ్యక్తులు రాంగ్ రూట్‌లో ద్విచక్ర వాహనాల ద్వారా రోడ్డు దాటుతుండగా లారీ, ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందారు.
- పెబ్బేరుకు చెందిన నిరంజన్ తన ద్విచక్ర వాహనంపై రాంపురం వెళ్లి తిరిగి పెబ్బేరుకు వస్తుండగా గుర్తుతెలియని వాహనం రాంగ్ రూట్లో వచ్చి ఢీ కొట్టగా అక్కడిక్కడే దుర్మరణం చెందాడు.
- పెద్దగూడెం చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కారు ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- ఆత్మకూర్ చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు పెబ్బేరు వచ్చి తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు.
- గత నెలలో రహదారిపై డీసీఎం ముందు వెళ్తున్న లారీని ఢీ కొనడంతో కర్నూల్‌కు చెందిన ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు.
- ఇటీవల గద్వాలకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర ఢీ కొట్టడంతో అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆరు వరుసల రహదారికి డీపీఆర్ పూర్తి

ప్రస్తుతం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు నుంచి హైదరాబాద్ వరకు జాతీయ రహదారి పొడవునా ఆరు వరుసల రహదారి నిర్మాణానికి డీపీఆర్ సర్వే పూర్తయ్యింది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియతో ఆరు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా ప్రాంతీయ రహదారి (సర్వీస్ రోడ్లు) ఎక్కడ అవసరం ఉందో అక్కడ వేసే అవకాశం ఉంది. ప్రధాన పట్టణాలతో పాటు ప్రతి గ్రామం, పాఠశాలల వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు అవుతుంది.

– సునీల్ కుమార్, ఎన్‌హెచ్ఏఐ మేనేజర్

రోడ్డు దాటడానికి ఇబ్బంది



జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వస్తుంటాయి. దీంతో రోడ్డు దాటడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు రోడ్డు ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నాం. ట్రక్ పార్కింగ్ వద్ద యూ టర్న్ ఏర్పాటు చేయాలి.

– మౌనిక, మహిళా పాలిటెక్నిక్, పెబ్బేరు

పాఠశాలకు వెళ్లాలంటే భయం



పట్టణ కేంద్రం నుంచి జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో పాఠశాలకు వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. ఆర్టీసీ బస్సు, ఆటోలకు ద్వారా పెబ్బేరు నుంచి తోమాలపల్లి స్టేజీ వద్ద యూటర్నుతో తిరిగి రావాలంటే 4 కిలోమీటర్ల దూరమవుతుంది. కళాశాల వద్ద రోడ్డు దాటేందుకు వాహనాలతో ప్రమాదాలు అవుతాయని భయంగా ఉంది.

– గణేష్, మాడల్ స్కూల్, పెబ్బేరు

ప్రతిపాదనలు పంపాం



పట్టణ నుంచి ప్రతిరోజు కళాశాలలకు, పాఠశాలకు వందల మంది విద్యార్థులు బస్సు, ఆటోలు, మోటర్‌సైకిళ్ల, కాలినడకతో వస్తుంటారు. వాహనాలు వచ్చేటప్పుడు రహదారిపై యూటర్న్ లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అదనంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో చాలా సార్లు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. – రాయిస్ ఫాతిమా, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, పెబ్బేరు

పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం



విద్యార్థులకు నగదును అందజేస్తున్న దాతలు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం అందిస్తున్న దాతల తోడ్పాటు వెలకట్టలేనిదని ఎంఈఓ భాస్కర్‌సింగ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ చెన్నయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ చదివి ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు గ్రామానికి చెందిన పాశం ఫౌండేషన్ అధినేత గోవర్ధన్‌రెడ్డి నగదు పురస్కారాలు అందించారు. కార్తీక్‌కు రూ.5వేలు, నిత్యకు రూ.4వేలు, దీపక్‌కు రూ.3వేలు, అరవింద్‌కు రూ.2వేలు, భవ్యశ్రీకి వెయ్యి చొప్పున నగదు అందించారు. రిటైర్డ్ పోలీసుఅధికారి రాఘవరెడ్డి రూ.5వేలు, వెంకటేష్ రూ.10వేలు, కౌన్సిలర్ చెన్నయ్య రూ.10వేలు పాఠశాల అభివృద్ధికి అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దోమ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని రెండో ఏఎన్‌ఎంల నిరసన



వనపర్తిలో నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో రెండో ఏఎన్‌ఎంల సమ్మె 4వ రోజుకు చేరింది. శనివారం మోకాళ్లపై కూర్చొని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఏఎన్‌ఎంల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి మా కడుపులు కొడతామంటే రోడ్ల పైకి రాక తప్పలేదన్నారు. వయస్సుతో పాటు కుటుంబ బాధ్యతలు ఉన్నాయని, చదివి పోటీ పరీక్షలు రాసే శక్తి లేదన్నారు. పలు శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం, తమను ఎందుకు పరీక్షలు రాయమంటుందని ప్రశ్నించారు. మా శ్రమ వల్లే రాష్ట్రానికి వైద్యరంగంలో పేరు వచ్చిందన్నారు. తెలంగాణ వస్తే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ



సామగ్రి అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

అమరచింత: ఇటీవల వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులతో పాటు వంట పాత్రలను అందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణానికి చెందిన బాధితులకు శనివారం అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ కాలంపాషా మాట్లాడుతూ ప్రపంచ మానవత దినోత్సవం సందర్భంగా సొసైటీ ద్వారా సాయం అందించామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్, లచ్చన్న, వెంకటేశ్వరమ్మ, లక్ష్మన్న, పద్మమ్మ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి



పాన్‌గల్: హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి తక్షణమే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ –ప్రభుత్వ విద్యా పరిరక్షణకై చేపట్టిన సమరభేరి జీపుయాత్ర శనివారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర హాస్టల్‌ను వారు సందర్శించి భోజనాలు పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని, విద్యార్థులకు ట్యూషన్స్ ప్రారంభించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మొగులి, కుమార్, మల్లేష్, ఈశ్వర్, మహేష్, వంశీ, ప్రసాద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మను దర్శించుకున్న నాయకులు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాలలో శనివారం పోచమ్మ విగ్ర ప్రతిష్ఠాపనకు మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భానుప్రకాష్‌రావు, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, వెంకట్రావ్, అరుణ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి



మనిగిల్ల జెడ్పీహెచ్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం శంకర్‌గౌడ్

కొత్తకోట రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వంగా ప్రవర్తించాలని మనిగిల్ల జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశమయ్యారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో నిష్ణాతుడై ఉంటాడని, దానిని వెలికి తీసేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలతో ఒత్తిడితో కాకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుగౌడ్, విజయ్‌కుమార్, సురేంద్రనాథ్, నాగేశ్వరమ్మ, చంద్రకళ, శ్రీరాములు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలి

పాన్‌గల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు తమ వంతు తోడ్పాటునందించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అలివేలు అన్నారు. శనివారం పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావా అందుతుందన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ బడుల బలోపేతనానికి తల్లిదండ్రులు సహకరించాలని హెచ్‌ఎం వరలక్ష్మి అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధాహ్న భోజనం అందుతుందన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి జాతర



కిష్టంపల్లి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లిలో శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకుని ఆంజనేయస్వామి జాతర గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున కృష్ణానదిలోని పవిత్ర కృష్ణా జలాలను తీసుకొచ్చి ఆంజనేయ ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. జల్ది బిందెలతో భక్తులు భక్తిగీతాలను ఆలపిస్తూ స్వామివారికి అభిషేకించారు. వివిధ ప్రాంతాల్లో బతుకు దేరువుకోసం వెళ్లి స్థిరపడిన గ్రామస్తులు జాతరకు హాజరై పూజలు నిర్వహించారు.

ఘనంగా ఆంజనేయస్వామి పల్లకీసేవ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరి ఆంజనేయస్వామి పల్లకీసేవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకీలో స్వామి వారిని ఉంచి ఊరేగించారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్ల రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు



కొత్తకోటలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని

వీపనగండ్ల: ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల సంఘం నాయకులు ఆంజనేయులు, రాంబాబు, అభి కోరారు. శనివారం లూయిస్ డాగురే చిత్రపటానికి మండల కేంద్రంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీకృష్ణ, గఫూర్, శేఖర్, మల్లయ్య, వెంకటేశ్వర్ల గౌడ్, వీరభద్ర, వెంకటేష్, రాంబాబు, గోపినాయుడు, వెంకట్రావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

కొత్తకోట: మండలంలోని ఫొటోగ్రాఫర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఫొటోగ్రాఫర్లు చౌరస్తాలో పటాసులు కాల్చి సంబరాలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టుకున్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో అసోసియేషన్ భవనం కోసం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో స్థలం ఇచ్చామని, భవన నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వేశ్వర్, సత్యం, వంశీ, బాలరాజు, సలాం, ముజీప్, అల్లావుద్దీన్, రమేష్‌చారి, ఆంజనేయులు, అంజన్న, కరీం, రవి, రాజు తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించండి



ఏఈకి వినతిపత్రం అందిస్తున్న హెచ్‌ఎం

అమరచింత: పాఠశాల ప్రాంగణంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ రాంచంద్రయ్యకు శనివారం హెచ్‌ఎం బలరాముడు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొన్నేళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు భయంతో గడిపే పరిస్థితులు ఉన్నాయన్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో అటుగా అధింకంగా వెళ్తుంటారని తెలిపారు. సమస్యను పరిష్కరించమని అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఫలితం లేదన్నారు.

తిరుమలనాథుడి ఉత్సవాలు



పెబ్బేరు రూరల్: శ్రావణమాస సందర్భంగా వనపర్తి మండలంలోని పెద్దగుడెం శివారులోని తిరుమలయ్యగట్టుపై వెలసిన తిరుమలనాథ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు నాలుగు శనివారాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి శనివారం ఉదయం ఆలయ అర్చకుడు కురుమూర్తి అలంకారం, అర్చనలు, అంకురార్పణం, కల్యాణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తినుబండారాల గుడారాలు కళకళలాడాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వనపర్తి రూరల్ ఎస్ఐ నాగన్న ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న 'గృహలక్ష్మి' సర్వే



వైశాఖపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



పాన్‌గల్‌లో వివరాల సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి



సల్కెలాపురంలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాన్‌గల్: మండలంలోని 28 పంచాయతీల్లో గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలపై గ్రామాల వారీగా సర్వే కొనసాగుతుంది. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి వివరాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు అందజేసిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ వివరాలను నమోదు చేస్తున్నారా? వివరాలు వాస్తవమా కాదా, ప్రస్తుతం ఉన్న ఇంటి పరిస్థితి, ఖాళీ స్థలం ఉందా అనే విషయాలను పరిశీలన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీఓ రఘురాములు, కార్యదర్శి రఘు ఉన్నారు.

నర్సరీల్లో మొక్కలకు గ్రేడింగ్ ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సైజుల ప్రకారం గ్రేడింగ్ ఇవ్వాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని సల్కెలాపురంలో పర్యటించిన ఆయన గ్రామంలో గృహలక్ష్మి పథకం ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని వైశాఖపూర్‌లో గృహలక్ష్మి దరఖాస్తులను శనివారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. అలాగే పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రోజా, సర్పంచ్ రవి పాల్గొన్నారు.